

# 8. పెళ్ళి

రజనీ పెళ్ళి చేసుకోబోతున్నదనే వార్త వినగానే నిర్మలకు షాక్ కొట్టినంత పనయింది. కెవ్వున కేకేసి చేతిలో పింగాణీ ప్లేటు జారవిడిచి తల్లి పెట్టే చివాట్లు తింటూ ఆ పగిలిన ప్లేటు ముక్కలన్నీ ఏరేసింది.

ఏమయింది రజనీకి ? తనొక నెలరోజులు అమ్మమ్మగారి ఊరు వెళ్ళొచ్చేసరికి యింత ఉపద్రవం ఎట్లా జరిగింది ?

ఊరు నుంచి రాగానే రజనీని చూడాలని బయల్దేరబోతూనే ఉంది. అంతలో తల్లి చెప్పింది. పింగాణీ ప్లేట్లో టిఫిన్ పెట్టి కూతురి చేతికిస్తూ "రజని నాలుగు రోజులనాడు నీ కోసం వచ్చిందే. నువ్వు లేవని ఓ పావుగంట అలిగి వెళ్ళింది. నా పెళ్ళి కుదిరిందని నిర్మలతో చెప్పండి అంది. ఒకటో తారీకున పెళ్ళట— షాపింగ్‌కి వెళ్దామని నీకోసం వచ్చిందట."

మాటలు పూర్తవకముందే పింగాణీ ప్లేటు బద్దలయింది. గబగబా తయారై ఇంట్లోంచి బైట పడింది. నడిచి వెళ్ళేంత స్థిమితం లేదు రిక్షా కోసం అటూ ఇటూ చూసి కనపడిన రిక్షా ఎక్కి కూచుని "బ్రాడీపేట రెండో లైను. పదమూడో అడ్డ రోడ్డు" అని చెప్పింది బేరం ఆడకుండానే.

రిక్షా పాకుంటూ పోతున్నట్లనిపించింది.

"రజనికి పెళ్ళి! రజనీ పెళ్ళి!"

ఐదేళ్ళుగా రజనీతో ప్రాణస్నేహం చేస్తున్న నిర్మల ఆ మాట అరిగించుకో లేక యుద్ధం చేస్తోంది.

మొట్టమొదట కాలేజీలో చేరిన రోజు రజనీతో పరిచయం గుర్తొచ్చింది నిర్మలకు.

"ఈ ఫిలాసఫీ గ్రూపులో ఎందుకు చేరానంటే పెళ్ళి తప్పించుకోవటం కోసం. నా తెలివి తేటలకు యింతకంటే మంచి గ్రూపులో సీటు రాలేదు. ఇదీ చదవనంటే ఇంట్లో పెళ్ళి పెళ్ళని చంపుతారు. ఆ పెళ్ళికంటే ఏదైనా నయం."

మొహమాటం, బెరుకూ, బిడియం లేకుండా నవ్వుతూ మాట్లాడే రజని ఎంతో నచ్చింది నిర్మలకు.

ఆ నాటి నుంచీ యిద్దరికీ మంచి స్నేహమయింది,

కలిసి కాలేజీకి వెళ్ళేవారు. కాలేజీ ఎగ్గొట్టి సినిమాలకు కూడా కలిసే వెళ్ళేవారు. ఇక కాలేజీలో జరిగే అన్నికార్యక్రమాల్లో విధిగా పాల్గొని సందడి సందడి చేసే వాళ్ళు. డిగ్రీ అయ్యాక M.A చదివారు.

సంవత్సరం నుంచీ కలిసికట్టుగా కలిసిరాని ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నారు.

ఈ అయిదేళ్ళలో రజనీకి పెళ్ళంటే ఉన్న అభిప్రాయం లేశమైనా మారినట్లు నిర్మలకు తెలియదు.

ఈ ఐదేళ్ళలో వాళ్ళతోటి కలిసి చదువుకున్న అమ్మాయిలకు ముప్ఫయి మందికి పైగా పెళ్ళిళ్ళయ్యాయి. ఫలానా అమ్మాయి పెళ్ళి అని తెలియగానే రజనీ "అయిపోయింది. ఒక వికెట్ పడిపోయింది. బంగారం లాంటి జీవితం సర్వనాశనమైంది"అని దీవించేది.

పెళ్ళి కాబోయే పిల్లల దగ్గరకు వెళ్ళి

"ఎట్టా బతుకుతావో ఏంటో - ఇంత అందంగా, అమాయకంగా వున్నావు నిన్ను తినేస్తాడు నీ మొగుడు"

అని కళ్ళనీళ్ళు పెట్టుకునేది.

ఏ స్నేహితురాలి పెళ్ళికీ వెళ్ళేది కాదు, ఎవరెంత బతిమాలినా.

"ఎందుకే జీవహింస నాకు పడదు బలి జరిగే చోటికి మూర్ఖులు తప్ప ఎవరైనా వెళ్తారా? ఇవాళొక అభాగ్యజీవి బలి కాబోతుంది. మనం వెళ్తే ఆ పెళ్ళి ఆపి దాన్ని రక్షించటానికి వెళ్ళాలి గానీ దాని చావుని చూడటానికి మనం సింగారించుకుని వెళ్ళటం ఏమిటి?"

అని నిర్మలను కూడా వెళ్ళనిచ్చేది గాదు.

నిర్మల రజనీని కాస్తన్నా మార్చాలని ఎంతో ప్రయత్నించింది.

"పెళ్ళిళ్ళ మూలంగా ఆడవాళ్ళు బాధలు పడుతున్నారు గానీ అన్ని పెళ్ళిళ్లూ అలా వుండవులే - కొందరు సుఖంగా సంసారం చేసుకోవటం లేదూ?" అని ఒకోసారి వాదనకు దిగేది.

రజని ససేమిరా ఒప్పుకునేది కాదు.

"నువ్వు కూడా బలిపశువులా మారాలనుకుంటే మారు. నన్ను మార్చటానికి ప్రయత్నించకు" అని పోట్లాడేది.

"పోనీ మంచివాడి నెవర్నన్నా చూసి ప్రేమించి పెళ్ళి చేసుకో"

అని నిర్మల కవ్విస్తే

"ప్రేమా - ఇంకా నయం. ప్రేమించినప్పట్నించీ వాడెక్కడ మోసం చేసి పోతాడోననే భయంతో నిద్రపట్టి చావదు. ఎందుకూ సుఖానున్న ప్రాణాన్ని దుఃఖాన పెట్టుకోవటం" అనేది.

ఇవాళ వాళ్ళకున్న సమస్యలతో ఆడవాళ్ళు ఇలాంటి అభిప్రాయాలకు రాకపోతే ఆశ్చర్యపడాలి గానీ వస్తే ఆశ్చర్యమేముంది? పెళ్ళిలో ప్రేమ దొరకదని ఈకాలం ఆడపిల్లలకు బాగానే తెలుసు. ప్రేమ సంగతి దాదాపు మర్చిపోయారు కూడా. కానీ యిప్పుడిప్పుడే భద్రత కూడా దొరకదనీ, భద్రత దొరికే రోజులు పోయాయనీ తెలుసుకుంటున్నారు. ప్రేమా, భద్రతా దొరకని పెళ్ళి దేనికోసం చేసుకోవాలని రజని లాంటి అమ్మాయిలు అడిగితే మరి సెక్సు సంగతేమిటని అడిగే ధైర్యం నిర్మలలాంటి వాళ్ళకు యింకా రాలేదు.

ఆడపిల్లలకు కూడా సెక్సు అవసరమనీ, వాళ్ళు ఆ సుఖం కోసం ఆరాటపడతారనీ పబ్లిగ్గా ఒప్పుకునే ధైర్యం మధ్యతరగతి వాళ్ళకింకా రాలేదు. పెళ్ళి కాకపోతే దాని మానాన అది బతుకుతుంది అనుకునే దాకా వచ్చారు. ఆ సుఖం గురించి ఆలోచించకుండా నిగ్రహంతో రోజులు వెళ్ళబుచ్చటం ఆడవాళ్ళకు పెద్ద కష్టం కాదని నమ్మటంలో సమాజానికి బోలెడంత సుఖం ఉంది.

అందువల్ల నిర్మల కూడా రజని పెళ్ళి చేసుకోనని అంటుంటే పెద్దగా పట్టించుకోలేదు.

రజని యిష్టం రజనీది అనుకుంది.

తీరా యివాళ ఈ వార్త.

రజనీని చూసి మాట్లాడేదాకా నిర్మలకు ఊపిరాడేలా లేదు.

ఎవర్నన్నా ప్రేమించిందా? అలాగయితే తనకు చెప్పేదే గదా? తను ఊళ్ళో లేని శుభ సందర్భంలోనే ఈ ప్రేమ కుదిరిందా ? పెద్దలు చూసిన సంబంధమా ? వచ్చినా ఒప్పుకోదే - ఏంటి ? ఏంటీ మాయ ? అనుకుంటూ రిక్షా దిగి అతని చేతిలో డబ్బులు పెట్టి హడావుడిగా రజనీ యింట్లోకి వెళ్ళింది.

"రామ్మా రా — నీ స్నేహితురాలి పెళ్ళి కబురు విన్నావుగా" అంటూ ఆహ్వానించింది రజనీ తల్లి.

"రజనీ లేదాండి ?"

"వచ్చేస్తుంది. టైలర్ దగ్గరకు వెళ్ళింది. పక్కవీధే. కూర్చో కాఫీ తెస్తాను" అంటూ లోపలికి వెళ్ళిందామె.

నెలరోజుల్లో యింత మార్పా ? ఈ ప్రపంచంలో ఎప్పుడు ఏది జరిగినా ఆశ్చర్యపడకుండా వుండటాన్ని న్యూస్ పేపర్లూ రాజకీయాలూ నేర్పాయిగానీ యిలాంటిది జరుగుతుందని ఎవరు మాత్రం ఎలా ఊహిస్తారు అనుకుంది నిర్మల. రజనీ వాళ్ళమ్మ యిచ్చిన కాఫీ తాగి వాకిట్లోకి వచ్చి నిలబడింది. వాకిలి ముందున్న కాస్త ఖాళీ స్థలంలో సన్నజాజి పందిరి వుంది. పందిరి నిండా నక్షత్రాల్లా విచ్చుకుంటున్న సన్నజాజులు. అప్రయత్నంగా పువ్వులు కొయ్యటం మొదలెట్టింది నిర్మల. పువ్వులు కొయ్యటం మొదలెట్టాలేగాని ఆ పనిలో యిట్టే లీనమైపోవచ్చు. మన ప్రమేయం లేకుండానే పువ్వులు మనల్ని లాగేసుకుంటాయి. పిచ్చెక్కించే రజని పెళ్ళి వార్తనుంచి కాసేపు మనసు మళ్ళించుకోటానికి నిర్మలకు ఈ పని

బాగానే పనికొచ్చింది. మొగ్గలు తుంచకుండా చకచకా పూలు కోస్తోంది. పదిహేను నిమిషాల్లో పమిట చెంగు నిండా పూలు నిండాయి. మెదడులో ఆలోచనల వుధృతం తగ్గి కాస్త ఖాళీ వచ్చినట్లయింది. మనసు కుదుటబడి సన్నజాజుల పరిమళాన్ని ఆస్వాదించేందుకు సహాయత్తమయింది.

అంతలో రజని రానే వచ్చింది.

"ఎందుకే పూలన్నీ కోశావు? పెట్టుకునేది జాడేదు-"

"మాలకట్టి నీకిస్తే పెళ్ళికొడుకు మెడలో వేస్తావనీ" అంది నిర్మల. "తెలిసిందీ—" అంటూ లోపలికి నడిచింది రజనీ.

కాసేపటికి పూలన్నీ పెద్ద పళ్ళెంనిండా పోసుకుని దారపుుండ తీసుకుని స్నేహితులిద్దరూ డాబా మీదకు చేరారు. అప్పుడే వెన్నెల ఆకాశంలో విచ్చుకుంటోంది. రజనీ నాలుగు నాలుగు పూలు కలిపి అందిస్తుంటే చకచకా దారంతో వాటిని బిగిస్తూ.

"చెప్పు" అంది నిర్మల.

"ఏం చెప్పాలి?" ముద్దుగా అడిగింది రజనీ.

"ఏం చెప్పాలట? సిగ్గు లేకపోతే సరి. పెళ్ళి చేసుకోటం యిష్టంలేక ఫిలాసఫీ చదివావు. అయిదేళ్ళ పెళ్ళి గురించి బద్ద శత్రువులా మాట్లాడావు. ఇప్పుడు అన్నీ మర్చిపోయి ఉబ్బరంగా పెళ్ళి చేసుకుంటున్నావు. చెప్పు ఏమొచ్చింది నీకు ఎందుకిలా చేస్తున్నావు?"

"ఏం చెయ్యను? పెళ్ళితో తప్ప తీరని కోరికలు కలుగుతాయనుకో" దిగులు నటిస్తూ అంది.

నిర్మల కోపంతో రెచ్చిపోయింది.

"ఇదేమాట పోయినేడాది కనకవల్లి పెళ్ళి చేసుకుంటూ చెబితే నువ్వేమన్నావు?"

"ఏమన్నాను?" గుర్తులేనట్టు అమాయకంగా ముఖం పెట్టింది రజని.

"నువ్వు దాన్ని పెళ్ళి చేసుకోవద్దో అని పోరు పెడుతుంటే సిగ్గు విడిచి చెప్పింది యిప్పుడు నువ్వన్న మాటల్ని.

అప్పుడన్నావు — కోరికల కోసం ఆత్మాభిమానం ఒదులుకుంటే చివరికి అవీ దక్కవు. కోరికలు జుగుప్సనే మిగులుస్తాయని ఏవేవో ఉదాహరణలు చెప్పావు.

నిన్ను తిట్టి, కొట్టి దాసీలా చూసేవాడు కావలించుకుంటే కోరిక కలుగుతుందా లేక వాడిమీద అసహ్యం పుట్టి రెండు తన్నాలనిపిస్తుందా? అని అడిగావు. పాపం కనకవల్లి రెండు రోజులు ఏడుస్తూ పడుకుంది."

మరీ యింత పచ్చి అన్యాయమా అన్నట్లు ఆవేశంతో అడిగి అలసటతో ఆగింది నిర్మల.

రజని కాసేపు సీరియస్‌గా ఆలోచించింది. కొత్త ఎత్తు ఏదో ఎత్తుతోంది అనుకుంటూ కసిగా పూల గొంతులకు ఉరిబిగిస్తోంది నిర్మల.

"నేను పెళ్ళి గురించి తెగ ఆలోచించానే నిర్మలా. పెళ్ళిని ప్రేమకోసమో భద్రత కోసమో కాకుండా ఒక వృత్తిలా ఒక బిజినెస్‌లా స్వీకరించదల్చుకున్నా. ఒక వ్యాపారంలోకి దిగినట్లు దిగదల్చుకున్నా పెళ్ళిలోకి" అంది బోధివృక్షం కింద బుద్ధుడిలా పోజిస్తూ.

"ఏంటీ?!" నిర్ఘాంత పోయింది నిర్మల.

రజనికి ఎక్కడలేని ఉత్సాహం ముంచుకొచ్చింది.

"కానే. నిజానికి పెళ్ళి పక్కా బిజినెస్. ఐతే ఆడవాళ్ళకు యిందులో పైసా లాభం రాకుండా ఉండటంకోసం ప్రేమా, దోమా పాతివ్రత్యం, మాతృత్వం వగైరాలు పెట్టారు. నిజానికి పెళ్ళి ఆడదానికికూడా లాభమే. ఇప్పుడు నాకు వెయ్యి రూపాయలు ఉద్యోగం వస్తేగానీ నన్ను నేను పోషించుకోలేను. అదే రెండువేల రూపాయల ఉద్యోగస్తుడ్ని పెళ్ళాడాననుకో నాకు జరిగిపోతుంది. ఇంటి చాకిరీ ఉంటుందనుకో కానీ మిగిలిన ఉద్యోగాలు ఏవి తీసుకున్నా యింతకంటే ఎక్కువే కష్టపడాలి. ఇంతకంటే తక్కువే గిట్టుబాటవుతుంది. వాటికంటే వివాహమే లాభసాటి వ్యవహారం కదూ?"

ఆయాసంగా ఆగింది.

"నీ మొగుడు తిడితే?"

"నేనూ తిడతా."

"కొడితే?"

"నేనూ కొడతా. నా సంగతి తెలుసుకుని మర్యాదగా ఉన్నాడా మంచిది లేకపోతే చంపుతా."

"నీ కంటే ముందు అతనే నిన్ను చంపితే"

"నాకు అకాల మరణం సంభవిస్తే దానికి అతడే బాధ్యుడని రాసిన కాగితం లాయర్ దగ్గర పెడతా. ఆ సంగతి అతనితో ముందుగా చెబుతా"

"ఇంత బద్ధ విరోధంతో ఎందుకు పెళ్ళి చేసుకోవాలి?" స్నేహితులిద్దరూ ఒకరి పాత్రలను ఒకరు వహిస్తున్న తన్మయత్వంలో జోరుగా మాటలు ఒదులు తున్నారు.

"ఏం చెయ్యాలి? ఉద్యోగం దొరకదు. ఇంట్లో తల్లిదండ్రులు పోరుపెడు తుంటారు. విన్నాళ్ళు మా ప్రాణాలకు పడి వుంటావన్నట్లు చూస్తారు."

"పెళ్ళికి కట్నంగా యిచ్చే డబ్బునూ, ఖర్చుపెట్టే డబ్బునూ తీసుకుని దానితో వ్యాపారం పెట్టుకో"

"ఆ వ్యాపారంలో దివాళా తీస్తే? అసలుకే ఎసరు వస్తే? పిచ్చిదానా మనకు మగాడే పెద్ద పెట్టుబడి. మన శక్తి కొద్దీ అతన్నుంచి ఎంతైనా రాబట్టుకోవచ్చు. నువ్వన్న కట్నం డబ్బుతో సహా వాడి నెత్తి నెక్కా-మనుకో చచ్చినట్టు జీవితాంతం మోస్తాడు."

"ఏం మొయ్యడు. ఎత్తి నేలమీదకు విసిరేస్తాడు."

"విసిరెయ్యనివ్వకూడదు. అతని పీక పట్టుకు వేళ్ళాడాలి. మరీ లాభం లేదనుకుంటే అతని పీక నొక్కె-య్యాలిగానీ మనం కిందపడకూడదు."

"అలా వేళ్లాడగలిగితే యివాళ యింతమంది ఆడవాళ్ళు యింత దౌర్భాగ్య స్థితిలో ఎందుకుంటారు?"

"అదే నేననేది. ఆడవాళ్ళు పెళ్ళంటే అది ఉద్యోగంకాదనీ వ్యాపారంకాదనీ ప్రేమతో ముడిపడిందనీ ఏదేదో సెంటిమెంట్లతో ఆలోచిస్తారు. గోతిలో పడతారు. నేను పెళ్ళినలా అర్థం చేసుకోను. ఒక ఉద్యోగస్తురాల్లాగా నా హక్కు-లకోసం దెబ్బలాడతాను. ఒక వ్యాపారస్తురాలిలాగా లాభంకోసం ఏమైనా చేస్తాను. వడ్డీతో సహా నాకు రావాల్సింది వసూలు చేస్తాను. అప్పుడు నాకు వచ్చేదే తప్ప పోయేది లేదు."

"పెళ్ళయ్యాక నీకు ఎవరిమీదనన్నా నిజమైన ప్రేమ కలిగితే ?"

"ప్రేమ అనకు. మోహం అను. ఎవరిమీదన్నా మోహం కలిగితే తీర్చుకో వటం పెళ్ళయిన స్త్రీకే తేలిక. ఎవరూ తొందరగా అనుమానించరు. పట్టుబడినా శిక్ష మగాడికే పడుతుందిగానీ పెళ్ళయిన ఆడదానికి పడదు. అదే పెళ్ళి కాని ఆడ దాన్నయితే వ్యభిచార నేరం కింద శిక్షించవచ్చు."

"పెళ్ళిని గురించి నీకింత జ్ఞానం ఎప్పుడు కలిగిందే ?" పడగళ్ళలా మీద పడుతున్న రజనీ మాటల్నుంచి తనను రక్షించుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తూ అంది నిర్మల.

"పెళ్ళి చేసుకుందామని నిర్ణయించుకున్నాక"

అల్లరిగా నవ్వింది రజని.

నిర్మల కోపంతో చేతిలోని పూలచెండుతో రజని చెంపమీద కొట్టింది.

రజని ఆ పూలచెండు లాక్కుని తల్లో పెట్టుకుని "పద కిందకు వెళ్దాం. వివేక్ వచ్చే టైమయింది. నిన్ను పరిచయం చేస్తాను."

అని నీరజను మరింత ఆశ్చర్యంలో ముంచుతూ కిందికి తీసుకెళ్ళింది.

వివేక్ అప్పటికే వచ్చాడు. వచ్చి పది నిముషాలయిందట. రజనీ వాళ్ళమ్మ పిలుస్తానంటే స్నేహితులు మాట్లాడుకునేప్పుడు డిస్టర్బ్ చెయ్యకూడదని చెప్పి వంటింట్లోకి వెళ్ళి కాఫీ పెడుతున్నాడట.

నిర్మలా, రజనీ డాబా దిగి హాల్లోకి వస్తుంటే రజనీ వాళ్ళమ్మ కంగారు పడుతూ చెప్పింది.

రజనీ తనను మోసం చేస్తోందని నిర్మలకు అర్థమైపోయింది.

రజనీ స్నేహాన్నీ, పైవ్రసీని గౌరవించేవాడు, తనంతట తను వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలుపుకునేవాడూ రజనీని 'పెళ్ళి' చేసుకుంటాడా ?

ఇద్దరూ వంటింట్లోకి వెళ్ళబోతుంటే ట్రేలో మూడు కప్పుల కాఫీ పుచ్చుకుని వివేక్ ఎదురొచ్చాడు.

"నా ఫ్రెండ్ నిర్మల" రజని పరిచయం చేసింది.

వివేక్ ట్రే ఒదిలి నమస్కారం చెయ్యకపోగా చిరునవ్వు మాత్రం నవ్వి పది నమస్కారాల ఎఫెక్టు తెప్పించాడు.

"ఘటికుడులానే ఉన్నాడు" అనుకుంది నిర్మల.

కాఫీలు తాగుతుండగా వివేక్ అన్నాడు

"రజనీ మీ గురించి చాలా చెప్పిందండీ."

ఇతన్నొక పట్టు పట్టి చూడాలనుకుంది నిర్మల.

"ఔనండి. మేమిద్దరం ప్రాణ స్నేహితులం. ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసు. ముఖాలు చూసి ఎవరేం ఆలోచిస్తున్నారో చెప్పేసుకోగలం. రుచులు, అభిరుచులు, అలవాట్లూ అన్నీ ఒకరివొకరికి బాగా తెలుసు. ఉదాహరణకు పెళ్ళంటే రజనికి ఎంత అసహ్యమో నాకంటే బాగా తెలిసిన వాళ్ళెవరూ లేరు."

"ప్రస్తుతం నాకూ కూడా తెలుసండీ" అన్నాడు వివేక్ మధ్యలో అడ్డొచ్చి.

ఏమో అన్నట్టు పెదవి విరిచింది నిర్మల.

"పెళ్ళి ఒక వ్యాపారం అని రజనీ అభిప్రాయం. మీకా సంగతి తెలుసా ?"

"నా పెళ్ళి చెడగొడతావా ఏం" నిర్మల చెయ్యి గిల్లింది రజని.

"నాకు తెలియటమే కాదండి. నా అభిప్రాయం కూడా అదే. అందుకే మేం పెళ్ళి చేసుకోబోవటం లేదు."

"ఆఁ !" నిర్మల నోరు తెరిచి ముయ్యటం కావాలనే మర్చిపోయింది.

"పెళ్ళి చేసుకోకుండానే కలిసి బతకాలనుకుంటున్నాం. ఐతే పెద్దవాళ్ళు తమ మర్యాదకు భంగం రాకుండా వాళ్ళ భాషలో పెళ్ళి చేసుకుంటున్నారని చెబుతున్నారు. ఫస్టు తారీకున మేమిద్దరం కొత్త యింట్లో కలిసి బతకబోతున్నాం. ఆ రోజు పెళ్ళిరోజని వాళ్ళంటున్నారు. అంతే."

"అవ్వ పేరే ముసలమ్మ. మీరిద్దరూ భార్యాభర్తల్లా బతకబోతున్నారు. అంతేగా."

"కాదు. ఇద్దరు స్నేహితుల్లా."

వివేక్ నవ్వుతుంటే ముచ్చటగా ఉంది. ఐనా మూతి తిప్పింది నిర్మల.

వివేక్ రజనీతో కొత్త యింటి తాలూకు వివరాలేవో మాట్లాడి వెళ్ళిపోయాడు.

"నువ్వు పెళ్ళికంటే ప్రమాదంలో పడ్డావు. ఇలా ప్రేమలో పడటం కంటే ఎవరో ఒకరితో పెళ్ళి బిజినెస్ చెయ్యటమే నయం. ఇక్కడ చాలా కోల్పోవాలి. ప్రేమ కోసం చాలా త్యాగాలు చెయ్యాలిగా" ఇప్పటికైనా స్నేహితురాలి కళ్ళు తెరిపిద్దామని ఆతృత పడుతోంది నిర్మల.

"అతనూ చేస్తానంటున్నాడుగా" అంది రజనీ డ్రీమీగా కళ్ళు సగం మూసుకుని.

"చూస్తాగా—" అంటూ బయటకు నడిచింది నిర్మల.

—అముద్రితం

★★
★